# అల్పమైన విలువలు

శ్రీమతి ఆర్. వసుంధర

'ఒకసారి ఆయమ్మ అయ్యతో కొట్లాడి ఒక పూటంతా అన్నంతినకుండా ఏడ్చారమ్మా ...' అన్నది పెరట్లో బియ్యం బాగుచేస్తూ రాజామణి.

అక్కడే కుర్చీలోకూర్చుని పుస్తకం చదువుతూ మరోప్రక్క రాజామణి బియ్యం ఒళ్లో పోసుకోకుండా అప్రమత్తతతోఉన్న నేను చేతిలోని పుస్తకాన్ని స్టూలు మీద పడేశాను. 'ఏమిటీ ? ఎందుకూ ?' అంటూ నిటారుగా కూర్చున్నాను, లోపల్నుండీ ఉబికివస్తున్న ఆసక్తిని పైకి కనబడనీయకుండా ఉంచాలని ప్రయత్నిస్తూ.

'ఏందో, రవ్వలకమ్మలు చేయించుకుంటానన్నారు. అయ్య వీల్లేదన్నారు. అమ్మ అలిగి ఏడ్చింది...' అన్నది రాజామణి ఏదో సామాన్యవిషయం చెబుతున్నట్లు.

అది సామాన్య విషయంకాదు. ఆమెను గురించిన నా ఊహను తలక్రిందులు చేస్తున్న విషయం. ఆమె నగలకోసం ఏడ్చేటంతటి తేలికమనిషని నేను అనుకోలేదు. నాకు ఆమెతోగల పరిచయం స్వల్పమే అయినా, ఆమె గొప్ప వ్యక్తిత్వంగల మనిషని తెలిసినంతలోనే అంచనా వేసుకున్నాను. మావారూ, అతనూ ఒకేరకం ఆఫీసర్లు కావడంవలన ఇద్దరం ఒకఊళ్లో ఉండటం జరగదు. ఈ సారి అతను ఖాళీచేసిన చోటులోనికి మావారిని వేశారు. వాళ్ళ యిల్లూ, వాళ్ల పనిమనిషీ, వాళ్ల చాకలీ, వాళ్ల పాలమనిషీ, వాళ్ల కొట్టువాళ్లూ అందరూ అన్నీ మాకు వారసత్వంలాగా దిగుమతీ అయ్యారు. వాళ్లు ఇల్లు ఖాళీచేసేలోగా రెండురోజులపాటు మేము హోటల్లో ఉన్నాం. అప్పుడు వాళ్లు మమ్మల్ని ఒక పూట భోజనానికి పిలిచారు. అదే ఆమెతో పరిచయం. ఆవిణ్ణి చూడగానే నాకు ఆనందం కలిగింది. తెల్లగా, చక్కగా, లావుగావున్నా నాజూగ్గా, కడిగిన ముత్యంలాగా, ఒంటెడునగలతో లక్ష్మీదేవిలాగా కనిపించింది. ఆమెచేసిన వంటకాలు, వడ్డించిన తీరు, ఇల్లుదిద్దుకునే నైపుణ్యం, పిల్లల విషయంలో క్రమశిక్షణ అన్నీ ఎంతో బాగున్నై. ఆ యింట్లో కనిపించే ఆడంబరం, శుభ్రత, చురుకుదనం, ఆదరణ అన్నీ ఆమెలోపుట్టి యిల్లంతా వ్యాపించి ఇంటినీ, ఇంట్లోని ప్రతి మనిషినీ, ప్రతి పనినీ నడుపుతున్నట్లుగా తోచింది నాకు ఆ కాస్సేపట్లోనే. తర్వాత క్రమంగా ఇరుగు వాళ్లూ, పనివాళ్లూ ఆ అభిప్రాయాన్ని బలపరచారు. ఆమె భలే మనిషి. ఆ భార్యా భర్తలిద్దరూ అనన్యసామాన్యమైన ఒద్దికతో, పరస్పర సహకార సానుభూతులతో లక్ష్మీకేశవుల్లా కనిపించారు.

ఆ లక్ష్మీదేవి గురించి రాజామణి యీ మాట చెప్పగానే నాలో ఏదో సంభ్రమం కలిగింది. మొదట ఒక్క క్షణకాలంపాటు రాజామణిమీద కోపం వచ్చిన మాట నిజమే. ఆమెను గురించి మాట్లాడ్డానికి యీ రాజామణికి తాహతు ఎక్కడిదీ? ఆమెకు అందం, డబ్బు, చదువు, సంస్కారం అన్నీ వున్నాయి. జీవితంలో విలువైనవేవో ఆమెకు తెలిసుండాలి. ఈ రాజామణికి ఏవీ లేవు. ఉత్త అల్పురాలు. నాగలోకాన్ని గురించి నక్కమాట్లాడ్డం ఎంత హాస్యాస్పదం! అనిపించిందిగాని, అంతలోనే వాళ్లను గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి పెద్దదై పోయింది. రాజామణిమాటలు నిజం కావేమోనన్న అనుమానం కొంచెం కూడా రాలేదు. 'ఓహో, ఈమెను గురించి గొప్పగా అనుకున్నానుగాని నిజానికి మామూలు మనిషే' అనీ తోచింది. ఆ తలపులో సంతృప్తిలాంటిదీ కలిగింది. తరువాత రాజామణిని గుచ్చిగుచ్చి ప్రశ్నించాను. ఒకరిదగ్గర నాలుగేళ్ళు వరసగా పనిచేసిన మనిషికి

ఆంతరంగిక కార్యదర్శి స్థానం లభిస్తుంది గనుక వాళ్ల వివరాలన్నీ తెలిసే వుంటాయి...భార్యా భర్తలకు అడపా దడపా వాదాలూ వివాదాలు వస్తూనే వుండేవి. రాజామణికి ఏడాదిపాటు పనిచేస్తే కొత్తకోక యివ్వొచ్చని అయ్య అంటే, అలాంటి ఒప్పందం ఏమీలేదు గనక పాత చీరె చాలని అమ్మ అన్నప్పుడు ఒకసారి తగూపడ్డారు. 'ఇట్లాంటివే ఎన్నో వుండేయి' అన్నది రాజామణి జల్లెట్లోని బియ్యంలోని పెద్దరాళ్లను చకచకా ఏరిపారేస్తూ, మొహంలోని యోగముద్ర చెగక్కుండా.

రాజామణి మామూలు మనిషికాదు. లక్ష్మీదేవి దాన్ని నాకు పరిచయం చేసిన విధానం యిది: 'రాజీకి నోట్లో నాలుకలేదు. ఒక్కమాట మాట్లాడదు. ఒక్కమాటకు బదులు చెప్పదు. చెప్పిన పని శుభ్రంగా చేస్తుంది. ఇచ్చింది తీసుకుంటుంది. అంతే, దానిరాత బాగాలేక, లేనిపోని తంటాతెచ్చుకొని, కష్టపడుతున్నదిగని అది మంచిది' అన్నదామె నవ్వుతూ, ఆప్యాయంగా దాన్నిచూస్తూ. అక్కడున్న యితర పనివాళ్లూ ఆమె మాటను ఏకగ్రీవంగా ఆమోదించారు. ట్రాన్స్ఫరయి వెళ్లిపోతున్న యజమానురాలు, వెళ్తూవెళ్తూ యింకో రెండు రూపాయిలు అదనంగాయిచ్చే అవకాశం ఉన్నప్పుడు, పరివారంలో యిలాంటి ఏకగ్రీవత దానంతటదే కుప్పతిప్పలుగా పుట్టుకొస్తుంది. రాజామణిమాత్రం సిగ్గుపడిపోతూ కళ్లు వాల్చుకున్నది, మాటాడకుండా.

రాజామణి బాహ్యరూపం చూసేవాళ్లకు వికారం కలిగిస్తుంది. మొదటిసారి చూడగానే నాకు చాలా అయిష్టత కలిగింది. వేరే ఎవర్నైనా పనికి పెట్టుకుందాం అనుకున్నాను. కాని లక్ష్మీదేవి మాటమీదనే దాన్ని పెట్టుకున్నాను. వెడల్పుగావుండే వికారమైన మొహమూ, పసుపురంగులో గారకట్టిన పలువరుసా, పాతికేళ్లకే సగం నెరిసిపోయినజుట్టూ, బూడిదరంగు కంటిపాపలూ, పొగచూరిన కట్టెలాంటి పొట్టిమనిషి—ఇది రాజామణిరూపం స్థూలంగా. అటువంటి కళ్లు నేను ఎక్కడా చూడలేదు మనుషులో. రాజామణి సాధారణంగా కళ్లెత్తి ఎవర్నీ చూడదు. కాని, చూచినప్పుడు ఆ బూడిదరంగు కనుపాపల్లోంచీ ఏదో అసహజమైనది బయల్దేరి యివతలివాళ్లను తాకుతుందేమోనన్న గగుర్పాటు కలుగుతుంది. ఆ కళ్లల్లో ఒక వెలుతురుగాని భావంగాని జీవంగాని లేదు. అన్నింటిమీదా ఒక బూడిదరంగు తెర దిగిపోయింది. కాని నిదానంమీద గమనిస్తే, ఎప్పుడో ఒకసారి, బహు అరుదుగా ఆ కళ్లు మెరవడం, ఆ మొహంలో ఒక వింత భావం వెలగటం కనిపిస్తుంది. తన విశాలమైన మనస్సునీ, దేవుడు తన వంతుకై యిచ్చిన గొప్పబాధల్ని నోరెత్తకుండా సహించగల తన ఓర్మిని ఏ కించిత్తో మాటల్లో వెలువరించవలసివచ్చినప్పుడూ, నరసిమ్మాయి ప్రస్తావన వచ్చినప్పుడూ ఒక తెల్లటివెలుతురు తళుక్కుమంటూ కళ్లల్లో ఆ చివర్నుండీ యీ చివరికీ ప్రసరిస్తుంది. బూడిదలాంటి ఆకాశంలో అకస్మాత్తుగా ఇంద్రధనస్సు కనిపించినట్లుగా, నిర్జీవమైన ఎర్రభూమిలో విరబూసిన తంగేడుమొక్కల గుంపును చూచినట్లుగా చూపరుల్ని విభ్రమంలో ముంచుతుంది. అప్పుడు రాజామణి నవ్వుతో యీ చెవినుండి ఆ చెవివరకూ విప్పారిన పలువరుసను పెదాలచాటుకు నెట్ట యత్నిస్తూ, కళ్లల్లోని మెరుపును చాటుచేస్తూ సిగ్గుగా పైరెప్పలు క్రిందికి జార్చుతుంది. కాని అది అరుదైన విషయం. అది జరిగే సందర్భాలు వేరువేరుగా కనిపించినా విషయం మాత్రం ఒకటే. అది రాజామణి మొగుడు నరసిమ్మాయి. రాజామణి మనసుయొక్క వైశాల్యమూ, బాధా సహిష్ణుతా, నరసిమ్మాయీ— మూడూకూడా ఒకటే నిజానికి. నరసిమ్మాయే రాజామణి ప్రియుడు, మొగుడు, బాధ, బ్రతుకు—అన్నీను. వాడు లేకుంటే రాజామణికి యీ కడగండ్లు ఉండవు. అందరి మాదిరిగా తనచాకిరీతో పొట్టపోసుకుంటూ, ముసలి ముప్పుకు నాలుగురాళ్లు వెనకవేసుకుంటూ హాయిగా ఉండేది, కంటినిండా నిద్రపోయేది అనుకోవచ్చు. మొగుడైనాకాని వాడికోసం ఇన్ని బాధలుపడుతూ ఉండటం సహజంకాదు గనుక అలా అనుకుంటాము. కాని మనిషిని మనిషిని ఆవరించిఉన్న పరిస్థితులనూ విడదీయటం సబబుకాదేమో. జీవితంలో విలువైనవేవో తెలుసుకోలేని పేద బ్రతుకులు అంతకంటే వేరుగా ఉండటానికి వీలుకాదేమో!

నరసిమ్మాయి రాకపూర్వం రాజామణి జీవితం చాల మామూలుగా ఒడుదుడుకులు లేకుండా జరిగిపోతుండేది. దాని మొగుడు పెళ్లయిన ఏడాదికే

పోయాడు. అప్పట్నుండీ పుట్టింట్లోనే ఉండిపోయింది. రాజామణికి బంధువులు చాలామంది ఉన్నారు. ముసలి తల్లి, పదిమందిపిల్లలతల్లియైన అక్క, పనిలేక డబ్బులేక బాధపడే అన్న, ఇంకా పిన్నమ్మలు, చిన్నాన్నలు, మామలు, అత్తలు, వాళ్లసంతానం అంటూ బీరకాయపీచులాగా పెనవేసుకుపోతూ చాలా బలగం ఉన్నది. కడుపు నింపుకోవడానికి పాచిపనులు చేసుకుంటుంది. ఒంట్లో ఓపికవుండి, రెండిళ్లలో పనిచేసుకోగల ఒంటరిమనిషికి లోటేమీ ఉండదు. అందులోనూ రాజామణికి సినిమాలు చూడాలనిగాని, కొత్తచీరలు కట్టుకోవాలనిగాని కోరికలు లేవు. తనకు దొరికిన అన్నమూ కూరలూ ఇంట్లోవాళ్లకిచ్చేది. 'నీవూ తిన్నావా ?' అని కనుక్కోగల అక్కరలేక పోయినా, అదితెచ్చే కూరలూ జీతండబ్బులూ నాకు కావాలంటే నాకు రావాలంటూ పిల్లలతల్లి అక్క, డబ్బు అవసరంలో ఉండే అన్నా పోటీలు పడేవారు. ఒకసారి వారూ ఒకసారి వీరూ మరోసారి ముసలితల్లీ దాని డబ్బు వాడుకునేవారు. మాకివ్వలేదంటే మాకివ్వలేదని అందరూ దాన్ని తిట్టేవారు. ఈ విధంగా 'సద్దులేని మనిషి' అని పేరు తెచ్చుకుంటూ, బంధువుల మధ్యన కాలం వెళ్లబుచ్చుతుండేది రాజామణి. ఇంకా ఎన్నోఏళ్లు, చిరకాలం, చచ్చేవరకూ అల్లాగే నలుగురి మధ్యనా వేలెత్తి చూపించుకోకుండా దాని బ్రతుకు వెళ్లవారి పోయుండేది, నరసిమ్మాయి తటస్థపడకుండా ఉంటే, దానికి పాడుబుద్ధి పుట్టకుండాఉంటే !

నరసిమ్మాయికి పెళ్లామూ ఇద్దరు పిల్లలూ ఉన్నారు. కనుముక్కు తీరుగా ఉండీ చూపరియైన వాడే. బాధ్యతలను లెక్కచెయ్యని స్వభావంకల కులాసామనిషి. ఏ ఒక్కపనిలోనూ కుదురుగా ఉండకుండా కొన్నాళ్లిక్కడ వంటపనిలోనూ, కొన్నాళ్లెక్కడో కూలిపనిలోనూ ఉంటూ హుషారుగా సరదాగా స్నేహితులతో ప్రొద్దుపుచ్చుతూ తిరిగేవాడు. అటువంటివాడికి రాజీమీద ఇష్టం కలిగింది. కారణం వాడికైనా తెలుసో తెలియదో. స్నేహితుడు సుబ్బరమణియం ప్రోత్సాహప్రోద్బలాలతో రాజీ వెంట పడ్డాడు నరసిమ్మాయి. కాలక్రమేణ వాళ్ల ప్రేమ చలంగారి మైదానంలో రాత్రిపూట విహారాలుగా పరిణతి చెందింది. ఆ మైదానం అక్కడి హైస్కూలు కాంపౌండు. విశాలమైన ఆటస్థలం, ఆ వైపు కొండ, ఈ వైపు చేలు, పైన ఆకాశంలో చంద్రుడు—అటువంటిచోట ఒంటరియైన జంటగా ఆటపాటల్తో విహరించేవారు వాళ్లిద్దరూ. వెన్నెల రాత్రిళ్లల్తో గాలికదలని వేళల్లో రాజీ పాట హైస్కూలుకు దగ్గరగాఉన్న ఇళ్లల్లోకి వినిపించేదట.

కాని నరసిమ్మాయి కోరుకునేది యిటువంటి జీవితంకాదు. 'పనిచేసి ఒళ్లరగ్గొట్టుకొని సంపాదించి వాళ్ల మొగాల వేస్తున్నావు. నీకేం సుఖం? నాతో వొచ్చెయ్యి. నీవు బ్రతికినన్నాళ్లూ నీ భారం నాది' అన్నాడు. అటువంటిమాట నరసిమ్మాయి గనక అనగల్గాడుగాని వేరేవాళ్లు అనుకునే సంగతికాదు. పెండ్లాం, పిల్లలూ, బంధువులూ నరసిమ్మాయిని ఒదలరు. రాజీ బంధుజనం దాన్ని చెడిపోనివ్వరు. అసలటువంటి పనిచేసే సాహసం రాజీకి లేదు. అది నోట్లో నాలుకలేనిది! అయినా నరసిమ్మాయిని ఇలాంటి కారణాలు బంధించలేవు. పట్టుదలగా రాజామణిని ఒప్పించడానికి ప్రయత్నించాడు, సుబ్బరమణి చేత దానికి హితవు చెప్పించాడు. చాలా ప్రయత్నం చేశాడు.

ఆఖరికి వాళ్లిద్దరూ ఆ ఊరిబయట మైదానంలో ఒక గుడిసెలో కాపరం పెట్టారు. వాళ్ల కుటుంబాల కోపతాపాలూ, తిట్లూ, అభ్యర్థనలూ, కొట్లాటలూ వాళ్లను మరింత దగ్గరకు తెచ్చాయే గాని వేరుచెయ్యలేకపోయాయి.

ఏళ్లు గడుస్తున్నా నరసిమ్మాయి వాగ్దానం తప్పలేదు. రాజీని విడవలేదు. కట్టుకున్నదాన్ని చూస్తున్నట్లే చూస్తున్నాడు. అంతకంటే ఎక్కువగానే చూస్తున్నాడనాలి. ఎందుకంటే కట్టుకున్న పెంళ్లాందగ్గరున్నన్నాళ్లూ ఆవిడ నరసిమ్మాయిని ఇంకా ఎక్కువ డబ్బుతేలేదనీ, ఎప్పుడైనా తాగుతాడనీ, సినిమాకు వెళ్తాడనీ నిత్యమూ సాధిస్తూ రాచిరంపాన పెడుతుండేది. ఇప్పుడు శుభ్రంగా పనిమానేసి, రాజామణి తెచ్చింది తింటూ, ఎప్పుడైనా తను సంపాదించింది తాగుతూ, హాయిగా గడిపేస్తున్నాడు. తాగివచ్చి పనినుంచీఆలస్యంగా ఇంటికొచ్చిందనో, బంధువుల్తో మాట్లాడిందనో, వాళ్లకు డబ్బు లిచ్చిందనో ఏదో ఒక సాకుతో రాజామణినీ చితక తంతున్నాడు.

తరువాత బోలెడంత పశ్చాత్తాపంతో దానికి క్షమార్పణలు తెలుపుకొని, దాన్ని బలవంతాన సినిమాకు తీసుకెళ్ళి, రెండురోజులపాటు తాగకుండా ఉంటున్నాడు దానికోసం. రాజీకోసం, వేరే ఎవరూ ఎప్పుడూ ఇలా త్యాగాలు చెయ్యలేదు !

రాజామణి ఒళ్ళు మంచిదికాదు. అప్పు డప్పుడు పైత్యమూ జ్వరమూ ముంచుకొస్తాయి. అలాంటప్పుడు ఒకసారి నరసిమ్మాయి దానిచేత పనిమాన్పించి ఇంట్లోనేవుండి తనకు వండిపెడుతూ, తాను తెచ్చింది తింటూవుండే ఏర్పాటుచేశాడు బలవంతాన. కాని పదిరోజుల్లోనే వాడు ఇంటికి డబ్బు తేలేడనీ, అంతా తాగేస్తాడనీ తేలిపోయింది. అందువలన ఇప్పుడు రాజీకి జబ్బుచేస్తే పనిమానెయ్యమని పదిసార్లు చెప్తాడుగాని, బలవంతం చెయ్యడు. దానికి కావలసిన గంజి కాచిపోసి, తొందరగా కోలుకొని పనిలోకి వచ్చేట్లు చూస్తాడు.

ఇన్నేళ్ళు గడిచినా నరసిమ్మాయి కుటుంబానికి వాడిమీది ఆశ పోలేదు. ఆర్నెల్లకోసారి పోలీసు బావమరిదో, పోస్టుజవాను బావమరిదో వచ్చి నరసిమ్మాయితో పేచీ పెట్టుకుంటారు. వాడు సంపాదించింది రాజామణికి దోచిపెట్టడానికి వీల్లేదనీ అదంతా తమ తోబుట్టువుకే చెందాలనీ పంచాయతీ పెడతారు. రాజామణి సుడిగాలిలో చిక్కుకుపోయిన ఎండుటాకులాగా కొట్టుకులాడిపోతుంది. నరసిమ్మాయి యీ అవమానం సహించలేక, రాజామణి దగ్గరుండే డబ్బంతా తీసుకుని, చిన్నకత్తి ఒకటి చేతబట్టుకొని, దోవలో కనపడ్డవాళ్లందరికీ ఆ కత్తిని చూపిస్తూ, తన బావమరదుల్ని యివాళ్టితో అంతంచెయ్యబోతున్నానని చెప్పుకుంటూపోతాడు. ఏఅర్ధరాత్రికో సుష్టుగాతాగి, తూలుకుంటూ, బావమరదుల్ని తిట్టుకుంటూ ఇంటికొస్తాడు.

రాజామణికీ నరసిమ్మాయికీ ఉండే సంబంధం నిజంగా అనిర్వచనీయమైనది; అవినాభావమైనది అనాలి. వాళ్లిద్దరూ ఒకరికొకరు అన్నివిధాలా తగిన మనుష్యులు. దానిదగ్గరలేని లోకజ్ఞానం, ముందుకు పోయే పురుషలక్షణం నరసిమ్మాయి దగ్గరున్నవి. వాడిదగ్గరలేని ఓరిమి రాజీ దగ్గరున్నది. ఇద్దరూ కలిస్తే హాయిగా బ్రతగ్గలతెలివి పుట్టుకొస్తుంది.

'మీకు తోచినంత జీతం ఇవ్వండి......నేను నోట్లో నాలుకలేనిదాన్ని' అన్నది రాజామణి పనిలో చేరబోయేముందు. నెలాఖరున పదిరూపాయ లిచ్చాను. ఆ మధ్యాహ్నం రాజీ పనిలోకి రాలేదు. నరసిమ్మాయి వచ్చి 'పదిహేను రూపాయి లిస్తేనే రాజీ పని చేస్తుంది...'అని నా మొఖంవేపు ఆశగాచూసి 'ఆ మిగతా అయిదు రూపాయిలూ నా చేతికివ్వండి. దాన్ని పంపిస్తాను' అన్నాడు. నేను ఒప్పుకోలేదు. 'మాకు పని తక్కువగనుక పదికంటే ఎక్కువ యివ్వను' అని చెప్పేశాను. మర్నాడు రాజీ పనిలోకొచ్చింది. 'ఆయన మాటలు కేమిలే అమ్మా. చేసేదాన్ని నేను...ఆ యమ్మ నన్ను బిడ్డలాగా చూసుకునేది. మీరూ అట్లాగే చూసుకోండి' అన్నది. 'చేసేది నీవైతే నిన్న మధ్యాహ్నం పనికి రాలేదెందుకూ'అని అడుగుదామనుకొని, మళ్లీ బిడ్డలాంటిదికదా అని సమాధానపడి ఊరుకున్నాను.

నరసిమ్మాయి తాగి కొట్టినప్పుడు, ఎక్కువ దెబ్బలు తగిలినప్పుడు రాజామణి బంధువులు ఏ చాటుగానోవచ్చి 'అయ్యో, పిచ్చిదానా, ఒళ్లు కరిగించుకొని సంపాదించి ఎవడి ఎదానో పోస్తున్నావే. వాడు నిన్ను చంపుతున్నాడే. ఇటు కులానికీ చెడితివి. అటు బతుకూ చెడెను' అంటూ సానుభూతి చూపిస్తారు. వాళ్లు చెప్పినప్పుడు తిరిగి మాట్లాడకుండా వింటుంది రాజీ. వాళ్లచేత పావలో పరకో పెడుతుంది. కాని వాళ్లమాటలు దానికి రుచించవు. 'ఏ సంసారంలోనైనా కష్టం సుఖం వుండదా. ఆయనకి నామీద ఎంత అపేక్ష ! నా కర్మ వల్ల యీ తాగుడు పట్టుకుంది' అనుకుంటుంది. వాళ్ల మాటలకి లోపలే బాధపడిపోతుంది.

వారాని కోపూటైనా చెప్పా పెట్టాకుండా పని మానేస్తుంది రాజీ—వాడు కొట్టినప్పుడు. పని మానేసిన కారణం చెప్పడానికి దానికి చాలకష్టంగా ఉంటుంది. ఏడుపు, అవమానం, ఇది అందరికీ జరిగేదే అన్న ధీమా—అన్నీ కలబోసినట్లుంటుంది దాని భావం. 'ఆయమ్మ నన్ను బిడ్డలాగా చూసుకునేది. ఆయన కొట్టినప్పుడూ, నాకు జబ్బుచేసినప్పుడూ ఎన్నిసార్లు పనిమానేసినా ఏమీ అనలేదు. ఒకసారి నాకు ఎక్కువదెబ్బలు తగిలినప్పుడు ఆయన్ని పిలిపించి కోప్పడి, ఆయమ్మకూడా ఏడ్చేసింది' అన్నది.

లక్ష్మీదేవిగారిలాగా రాజామణిని బిడ్డలాగా చూసుకోవలసిన బాధ్యత నామీదున్నదన్న భావన నాలో నాటుకపోయింది. అందువలన చెప్పకుండా పనిమానెయ్యడం వలన కలిగే కష్టాన్ని నోరెత్తకుండా అనుభవించ వలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా రాజామణి కష్టం నా కష్టంగా మారిపోయేంత కాలం గడిచాక ఒకసారి అన్నాను : 'నీవు చాకిరీచేసి వాడిని పోషిస్తున్నావు. వాడేమో నీకష్టం గమనించకుండా యిష్టంవచ్చినట్లు తాగుతున్నాడు. వాడు నీకు మొగుడుకూడా కాదు. చీటికీ మాటికీ ఈ తన్నులేమిటి ? నీ బ్రతుకు నీవు వేరుగా బ్రతుక్కోరాదా ?' అని. రాజామణి కనుబొమల మధ్యన అయిష్టతను సూచించే చిన్నగీత కనపడి అంతలోనే మాయమైంది. కొంచెంసేపు మాట్లాడకుండా నిలుచున్నది. 'నేను పోతానంటే పోనివ్వడు. ఆయన్ని పొమ్మంటేపోడు. నీవు చచ్చేదాకా నా దగ్గరుండాల్సిందే. నేను లేకుండా నీవుండటానికి వీల్లేదు. నీవు నా చేతులమీదగా దాటిపోయినాకనే నేను బయటకి పోయేది అంటాడు' అన్నది ఎంతో గర్వంగా, ఆనందంగా.

చచ్చేదాక వదల్నంటున్నాడు. లంబాడిదయ్యంలాగా పట్టుకున్నాడు. దాని చావుగురించి మాట్లాడ్డానికి వాడి కెంత ధైర్యం! తాగితాగి వాడే ముందు చావొచ్చునుకదా! సమాజం వాడికేదో హక్కును దత్తంచేసినట్లు మాట్లాడుతున్నాడే. అసలు దానికీ వాడికీ ఏమిసంబంధం గనక! వాడు బుద్ధిలేకుండా అవమానకరంగా మాట్లాడుతుంటే ఆ రాజామణికి ఏడుపు రావలసిందిపోయి ఆనందం కలుగుతున్నదెందుకో? కులం పోగొట్టుకొనకముందు దానికి దెబ్బలుండేవికాదు. రోగం వచ్చినప్పుడు పలకరించి సలహాలిచ్చే బంధుబలగం ఉండేది. చస్తే కొమ్ము పట్టడానికి కులపువాళ్లుంటారని గ్యారంటీ ఉండేది. సమాజంలో మనిషిగా ఎన్నోహక్కులు కలిగిఉండేది. అనవసరంగా తెలివితక్కువగా అన్నీ పోగొట్టుకున్నది రాజామణి ఈ దెబ్బల్తో చస్తూ యిలా బ్రతకడానికి?

ఆనాడు నాకూ మా ఆయనకూ ఆయన భోంచేస్తున్నప్పుడు మాటామాటా వచ్చింది. ఆయనకు తెలిసినవాళ్లెవరో పాతకారు మంచిదొకటి అమ్ముతున్నారట. రోజూ ఆఫీసుకి బస్సుల్లో రిక్షాల్లో వెళ్లడం కష్టంగా ఉన్నది గనుక ఆ కారు కొనుక్కోవాలని ఆయన ఉబలాటం. వెధవకారుకి బోలెడు ఖర్చు గనుక ఆ డబ్బుపెట్టి నగ చేయించుకుంటే మన డబ్బు మన దగ్గరే వుంటుందని నా ఉద్దేశం. ఇద్దరం ఘాటుగానే మాట్లాడుకున్నాం. భోజనం సగంకాకుండానే ఆయన అన్నంపళ్లెం విసురుగా తోసేసి లేచివెళ్లిపోయారు. ఆ రోజు సాయంత్రం ఇంట్లోఉండబుద్ధికాకనాలుగిళ్లవతలఉన్న నా స్నేహితురాలు సుజాతను చూడాలని వెళ్లాను. వాళ్ల వాకిట్లోకి వెళ్లేసరికి లోపల్నుండి మాటలు వినిపిస్తున్నై. రాజామణి గొంతు. 'ఆ యమ్మమీద అరిచి అన్నం తినకుండా పళ్లెంతోసేసి లేచిపోయారు. ఇట్లాగే ఏదో ఒకటి పడుతూనే వుంటారు...' అంటున్నది.

ఖచ్చితంగా నా సంగతే ! ఉదయం జరిగిన సంగతి! చిన్నవిషయాన్ని కొండంతచేసి చాటిస్తున్నది! ఈ సుజాతకు పనివాళ్లమాటలు వినే దుర్బుద్ధి ఎందుకో అని విసుక్కున్నాను. మా తగాదాలు మరికొన్ని రాజామణిదృషి కి రాకముందే దాన్ని పంపించెయ్యడం మంచిదని నిశ్చయించుకున్నాను. సంసారమన్నాక వారి వారి హక్కుల్ని కోరికల్ని సమర్థించుకోవలసి నప్పుడు ఎన్నో మంచిచెడ్డలు, సర్దుకుపోవడాలు ఉంటాయి మరి. సవ్యమైన సంసారం లేని దానికి యిటువంటి విషయాలు ఏంతెలుస్తాయిగనుక!

సాధారణంగా అతి తక్కువగా మాట్లాడే రాజామణి ఎక్కడైనా భార్యాభర్తల మధ్యన కించిత్తు అభిప్రాయభేదం రాగానే అదేదో గొప్పవిషయమైనట్లు చాటింపువెయ్యడం ఎందుకో నాకు అర్థంకాలేదు. దానికెవరో ఏదో అపకారం చేసినట్లు ఈ ఏడ్పుగొట్టుతనం ఏమిటి ? జీవితంలో విలువైనవేవో కానివేవో తెలుసుకోగల వాళ్లను విమర్శించ

డానికి యీ కులంలేనిదానికి సిగ్గు నాలేదు! అను కున్నాను. దాని క్షుద్ర జీవితకథను తలచుకుంటే ఒక చిన్నవిషయం నాకు తెలియకుండా మిగిలిఉన్నట్లు తోచింది. ఊరికే ఊసుపోక అడిగాను 'పుట్టినప్ప ట్నుండీ చచ్చేదాకా అవసరమయ్యే బంధువుల్నీ కులాన్నీ విడిచిపెట్టి ఇటువంటి తెలివితక్కువపని ఎందుకు చేశావూ ?' అని.

రాజామణి కళ్లల్లో సిగ్గులమెరుపులు దాచు కుంటూ నెమ్మదిగా చెప్పింది: 'ఏం చేసేదమ్మ. నా ఖర్మ, నేను పనిచేసే ఇంటిఅమ్మ పెద్ద స్టీలుగిన్నెలో అన్నం ఇచ్చింది. ఆయన ఆ గిన్నెకాస్తా దాచేశాడు. ఎంత బతిమాలినా యివ్వలేదు. తనతో వచ్చేస్తా నంటేనే యిస్తాననీ లేకపోతే యివ్వననీ పంతం పట్టాడు. ఆయమ్మగిన్నె ఏదంటే ఏంచెప్పేది ? నోట్లో నాలుకలేనిదాన్ని, అందుకని...' అన్నది.

ఒక్క స్టీలుగిన్నెకోసం! ఒక జీవితాన్ని నడి పించడానికి, వేరో మలుపుకు తిప్పడానికి ఎంత అల్ప మైన కారణం! ఎంత అల్పమైన విలువలు!! అని ఆశ్చర్యపోయాను. బ్రతుకు విలువ ఎంతటిదో దాని లాంటివాళ్లకు ఎలా తెలుస్తుందిఅని సమాధాన పడ్డాను. ఇంతకూ దాని ఏడ్పుగొట్టుతనానికి కారణంమాత్రం నాకు తెలియడంలేదు!

---

